

విమానయాన సేవలు విస్తృతం

జిల్లాలో ఎయిర్ పోర్ట్ నూతన టెర్మినల్ బిల్డింగ్ ఏర్పాటుతో విమానయాన సేవలు విస్తృతం కానున్నాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -8లో



వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం

వచ్చే ఎన్నికల్లో ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డిలను గెలిపించి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుందామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.8/24.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.6 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.73 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

పెరుగుతున్న ఉద్రిక్తతలు!

- ఎన్నికలు సమీపించే కొద్దీ రెచ్చిపోతున్న తెలుగుతమ్ముళ్లు
- సంక్షేమ పథకాలు తొలగిస్తే వలంటీర్ల కాళ్లు చేతులు నరుకుతామని హెచ్చరిక
- స్వయంగా వెల్లడించిన కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి
- నేడు మాజీ టీడీపీ నేత సాయినాథశర్మపై పుత్తా అనుచరులు ప్రత్యక్ష దాడి



సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జిల్లాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ప్రజామెప్పుతో విజయం సాధించాలనే తపన లేకపోవడమే అందుకు కారణమవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఓడిస్తాయనే అభద్రతాభావం మరోవైపు వెంటాడుతోంది. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. జిల్లాలో తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ప్రత్యక్ష బెదిరింపులు, భౌతికదాడులకు దిగుతున్నారు. క్రమం తప్పకుండా ఇలాంటి ఘటనలు తెరపైకి వస్తున్నాయి.

కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి వరుసగా నాలుగు సార్లు ఓటమి పాలయ్యారు. మరోమారు ప్రజాతీర్పు కోరేందుకు సన్నద్ధయయ్యారు. ప్రజల మన్నలు పొందాల్సిందిపోయి, బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆపితే, అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల కాళ్లు చేతులు నరుకుతామని హెచ్చరించారు. వాస్తవంలో కులం, మతం, పార్టీలు, వర్గాలతో నిమిత్తం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని బాధ్యతలు తీసుకున్న తొలిరోజే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అక్షరాల అదే ఆచరణలో చూపెట్టారు. ఈపరిస్థితుల్లో ఎవ్వరి సంక్షేమ పథకాలు ఆగిపోయే అవకాశమే లేదు. కాకపోతే పుత్తా నరసింహారెడ్డి కాళ్లు చేతులు నరుకుతామనే బెదిరింపులకు పాల్పడడం వెనుక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో భయోత్పాతం సృష్టించేందుకేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈఘటన మరువక ముందే ఆదివారం టీడీపీ మాజీ నాయకుడు సాయినాథశర్మపై పెద్దచెప్పలిలో పుత్తా చైతన్యరెడ్డి అనుచరులతో కలిసి ప్రత్యక్ష దాడికి తెగబడ్డారు. రాజకీయంగా గత కొంతకాలంగా కొరకరాని కొయ్యగా సాయినాథశర్మ తయారు కావడమే అందుకు కారణంగా పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ప్రధానంగా కమలాపురంలో ఉద్రిక్తత పరిస్థితులు క్రమం తప్పకుండా తెరపైకి వస్తుండడం విశేషం.

అక్కసు వెళ్లగక్కిన ప్రవీణ్

వలంటీర్లపై ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల అక్కసు వెళ్లగక్కారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను అంకుశం సినిమాలో విలన్ రామిరెడ్డిని కొట్టినట్లు వీధుల వెంబడి కొట్టుకుంటూ వెళ్తామని బాహాటంగా ప్రకటించారు. వాస్తవంలో వలంటీర్లు ప్రజా సేవకులుగా గుర్తింపు పొందారు. అలాంటి వారిపై అక్కసు వెళ్లగక్కడం వెనుక ప్రజాపోరాటంలో విఫలం కావడమేనని విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు వలంటీర్లు నుంచి కూడా టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కు ప్రతిఘటన ఎదురైంది. రంగస్థలంలో సినిమాలో నియంతగా వ్యవహరించిన జగపతిబాబును కొట్టినట్లు తరిమితరిమి ఎన్నికల్లో కొడతామని హెచ్చరికలు జారీ చేయడం విశేషం. కాగా ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జిల్లాలో ఉద్రికత్తలు క్రమేపీ అధికమవుతున్నాయి. ప్రభుత్వ వ్యవస్థలు మరింత చురుగ్గా పనిచేసి ఇలాంటి చర్యలను కట్టడి చేయాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

పులివెందుల సిగలో

మరో కలికితురాయి!



వైఎస్సార్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి



మినీసెక్రటేరియట్

- నేడు డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల జాతికి అంకితం
- మొత్తం రూ.861.8కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించనున్న సీఎం

సాక్షి ప్రతినిధి, కడప: 'పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాన్న రెండు అడుగులు ముందుకేస్తే, ఆయన కొడుకుగా నాలుగు అడుగులు ముందుకేస్తా... మీ బిడ్డగా నాక్కావాల్సింది మీ ప్రేమాభిమానాలు..ప్రతి ఇంట్లో ఉన్నట్లుగా నాన్న ఫొటో పక్కన నా ఫొటో కూడా చేరాలి' విపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అచ్చం అలాగే పేదలకు పెన్నిధిగా మారారు. సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. పుట్టిన గడ్డ వైభోవపేతానికి విశేషకృషి చేస్తున్నారు. దీంతో పులివెందుల సిగలో మరో కలికితురాయి వచ్చి చేరింది. రూ.861.84 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. ఓవైపు జిల్లా కేంద్రమైన కడపను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారు. అత్యాధునిక వైద్య సేవలకు నిలయంగా నెలకొల్పారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. మరోవైపు పుట్టిన గడ్డ పులివెందుల రుణం తీర్చుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.500కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారు. పార్లమెంట్‌పరిధిలో ఒక మెడికల్ కళాశాల నిర్మించాలని సంకల్పించిన సీఎం, డిసెంబర్ 26, 2019న పులివెందులలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.తర్వాత రెండేళ్లు కోవిడ్ వైరస్ కారణంగా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 627 పడకల వసతి గల ఆస్పత్రి, ఏడాదికి 150 మెడికల్ సీట్లు, 60 నర్సింగ్ సీట్లల్లో విద్యార్థులు విద్యను అభ్యసించేలా నెలకొల్పారు. జీ ప్లస్ 3గా నిర్మించిన ఈ భవనాలు ఒక్కొక్క ఫ్లోర్ 37,300 చదరపు అడుగులతో చేపట్టారు. రాబోయే విద్యాసంవత్సరానికి మెడికల్ కళాశాల అందుబాటులోకి వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు.

అందుబాటులోకి ఆదిత్య బిర్లా గార్మెంట్స్

పులివెందుల కేంద్రంగా నూతనంగా నిర్మించిన ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యూనిట్‌ను సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. 16 ఎకరాల విస్తీర్ణంలో రూ.175 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ సంస్థ నిర్మాణానికి 2021 డిసెంబర్ 24న శంకుస్థాపన చేశారు. ఉత్పత్తి ఆధారిత ప్రయోజనాల (పీఎల్ఐ) పథకంలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్ టెక్స్‌టైల్స్, బ్రాండెడ్ గార్మెంట్స్ తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. ఏటా 24లక్షల గార్మెంట్స్ తయారీ సామర్థంతో నెలకొల్పిన ఈ యూనిట్‌లో 2100 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి కల్పించేలా తీర్చిదిద్దారు. తొలిదశగా 500మందికి ఉద్యోగాలు కల్పించారు.

వైఎస్సార్ మెమోరియల్ పార్క్

ఇడుపులపాయ కేంద్రంగా రూ.39.13 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందులో 48 అడుగుల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంతోపాటు, ఆడియో విజువల్, ఫొటో గ్యాలరీ, పెవిలియన్ బ్లాక్స్‌తోపాటు, రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్క్, గార్డెన్స్ నిర్మించారు. పులివెందుల సమీపంలో రూ.66 కోట్లతో 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉలిమెల్ల లేక్‌ను ప్రారంభించనున్నారు. మ్యూజికల్ లేజర్ ఫౌంటేన్, కిడ్స్‌ప్లే ఏరియా తదితర సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. మరో రూ.20 కోట్లతో నిర్మించిన బ నానా ప్యాక్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. మొత్తంగా పులివెందుల నియోజకవర్గంలో రూ.861.84కోట్ల అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పులివెందుల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీ పులివెందుల ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన పర్యటించే ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్.పరిశీలించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే వైఎస్సార్ మెడికల్ కళాశాల, కళాశాలలోని భవనాలను పరిశీలించారు. అనంతరం బనానా ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్, మినీ సెక్రటేరియట్ భవనాన్ని, వైఎస్సార్ సర్కిల్ బోలేవార్డు షాపింగ్ కాంప్లెక్స్ గాంధీ సర్కిల్, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, అక్కడే నూతనంగా నిర్మించిన ఆదిత్యా బిర్లా గార్మెంట్ లిమిటెడ్ ఇండస్ట్రీని, సంయుగ్లాస్ ఇండస్ట్రీని వారు పరిశీలించారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు: ఏస్పీ

పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల11 జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసులకు సూచించారు. ఆదివారం ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ కడప ఎయిర్ పోర్టు, పులివెందుల హెలీప్యాడ్, ప్రారంభోత్సవాలు జరిగే ప్రాంతాల్లో గట్టి భద్రత ఏర్పాటు చేయాలన్నారు.అదనపు ఎస్పీ సుధాకర్,స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, కర్నూల్ అదనపు ఎస్పీ నాగరాజు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రణాళికాబద్ధంగా పులివెందుల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారు. పులివెందులలో మెడికల్ కళాశాలను జాతికి అంకితం చేయనున్నారు. సొంతగడ్డ పులివెందులను సుందరంగా, రమణీయంగా తీర్చిద్దారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అనునిత్యం కృషి చేశారు. నూతనంగా ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. – వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, కడప

సీఎం ప్రణాళిక మేరకే..



రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పారిశ్రామికప్రగతికి విశేష కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా, పులివెందుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా మెడికల్ కళాశాల అందుబాటులోకి రానుంది. పులివెందుల సుందర పట్టణంగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే పులివెందుల ముఖ్యమంత్రి కలలకు కార్యరూపంగా నిలవనుంది. – విజయరామరాజు, కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

ఘనంగా రాయలసీమస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

ప్రారంభించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



బాడీబిల్డింగ్ క్రీడాకారులతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని నేక్‌నామ్ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం షంషీరుద్దీన్ స్మారక 1వ రాయలసీమస్థాయి బాడీబిల్డింగ్ కాంపిటీషన్, మెన్‌ఫిజిక్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని 1వ రాయలసీమ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిత జీవితంలో వ్యాయామంకు చోటు కల్పించాలన్నారు. బలమైన దేహం ఉండటం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఎంతో క్రేజ్ ఉండే ఈ క్రీడ పట్ల యువత ఆసక్తి పెంచుకుంటున్నారన్నారు. తాను కూడా గతంలో బాగా సాధన చేసేవాడినని, ప్రస్తుతం సమయం సరిపోకపోవడంతో సాధన చేయలేకపోతున్నామన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు ప్రతియేడాది నిర్వహించాలని ఆకాంక్షించారు. బాడీబిల్డింగ్ క్రీడపై మరింత అవగాహన పెంపొందాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం క్రీడాకారుల ప్రదర్శనను ఆయన తిలకించి అభినందించారు. దివ్యాంగుడైన బాడీబిల్డర్ కరీముల్లాను ప్రత్యేకంగా అభినందించి ఆర్థికసాయం అందజేశారు. న్యూ ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి న్యామతుల్లా మాట్లాడుతూ ఎందరికో అవకాశం కల్పించిన సీనియర్ క్రీడాకారుడు షంషీర్దున్ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎం.తారీఖ్‌అలీ, ఉపాధ్యక్షుడు అన్సరీఅలీ, ట్రెజరర్ ఇంతియాజ్‌ఖాన్, అమీన్ హాస్పిటల్స్ ఎండీ అమీన్, రెఫరీలు, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి 'స్పందన' రద్దు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11న జిల్లాలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా అధికారులందరూ ముఖ్యమంత్రి కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున సోమవారం జరగాల్సిన 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

గంగమ్మ జాతరకు బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు కడప రీజియన్ నుంచి 50 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి 25 బస్సులు నడుస్తాయన్నారు.వీటిలో రూ.80 చార్జిగా నిర్ణయించామన్నారు. పులివెందుల డిపో నుంచి వేంపల్లె మీదుగా 25 బస్సులు నడుపుతున్నామన్నారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని సీఎస్ఐ క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ అండర్-17, సీనియర్ విభాగం ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. డానియల్ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు థామస్ జీవన్‌బాబు, కార్యదర్శి సుధీర్, డీఎస్ఏ శిక్షకుడు ఎస్.వి.పి.అమృత్‌రాజ్‌లు విచ్చేసి ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవితఖైదీ ఆత్మహత్యాయత్నం

కడప అర్బన్ : కడప కేంద్రకారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న రామాంజి (23) ఆదివారం ఆవరణంలోనే ఓ చెట్టుకు వైరుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రొద్దుటూరుకు చెందిన రామాంజికి రెండేళ్ల క్రితం ఓ హత్య కేసులో జీవితఖైదు పడటంతో శిక్షను అనుభవించేందుకు కడప కేంద్రకారాగారానికి వచ్చాడు. కొన్ని రోజులుగా తనకు మానసిక పరిస్థితి సరిగా లేదని, తనను కడప రిమ్స్‌కు పంపించాలని కేంద్ర కారాగారంలోని వైద్యుడిని పదేపదే అడిగాడు. ఆయన ఆసుపత్రికి పంపలేదనే ఆవేదనతో ఆవరణంలోని ఓ చెట్టుకు వైరుతో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించాడు. సహచర ఖైదీలు గమనించి కారాగార అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతన్ని తీసుకుని కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం జీవితఖైదీ రిమ్స్‌లోని ఎంఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్‌ను వివరణ కోరగా సంఘటన జరిగింది వాస్తవమేనని, రామాంజి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

విషద్రావణం తాగి అస్వస్థత

మదనపల్లె : కటింగ్ చేసుకునేందుకు సెలూన్‌కు వెళ్లిన ఓ యువకుడు షాపులోని ద్రావణాన్ని జ్యూస్‌గా భావించి తాగడంతో అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్(21) కటింగ్ చేసుకునేందుకు సెలూన్ షాపునకు వెళ్లాడు. అక్కడ బాటిల్‌లో నీలిరంగులో ఉన్న ద్రావణాన్ని స్ప్రింగ్ జ్యూస్ అనుకుని పొరపడి తాగేశాడు. దీంతో అస్వస్థతకు లోనైన అజయ్ కుమార్ కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విమానయాన సేవలు విస్తృతం

- కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ రూ. 266 కోట్లతో శంకుస్థాపన
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- వర్చువల్ విధానం ద్వారా శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ నూతన టెర్మినల్ బిల్డింగ్ ఏర్పాటుతో విమానయాన సేవలు విస్తృతంతోపాటు జిల్లాలో అన్ని రకాల రవాణా వ్యవస్థలు మెరుగు పడనున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 14 విమానాశ్రయాలతోపాటు కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉత్తర్ ప్రదేశ్ అజాంఘర్ నుంచి వర్చువల్ విధానం శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా రూ.226 కోట్ల నిధులతో కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులకు ప్రధానమంత్రి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు జిల్లా కలెక్టర్ విజయరామరాజుతోపాటు ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అండర్ సెక్రటరీ సురేష్ బాబు, జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం కోసం రూ. 266 కోట్ల నిధులతో దేశ ప్రధాని ఈ రోజు శిలా ఫలకాన్ని ఆవిష్కరించడం జిల్లాకు గర్వకారణంగా చెప్పవచ్చన్నారు. మనకు సువిశాలమైన పారిశ్రామిక కారిడార్ ఉన్నందున.. భవిష్యత్తులో ఈ విమానాశ్రయం నుంచి సంతృప్తికరమైన సేవలతోపాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి, అటు కేంద్ర ప్రభుత్వానికి పుష్కలమైన ఆదాయ వనరుగా కూడా రూపుదిద్దుకోనుందన్నారు. ప్రాంతానికి ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరుచడం, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, విద్య, ఉపాధి పెంపుదల, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల పురోగతిని వేగవంతం చేయడం వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయన్నారు. ఫారెస్ట్ ఏరియాలో అతి సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో అటవీశాఖ అనుమతులు, స్థానిక భూ యజమానులను ఒప్పించి భూసేకరణ చేయడం వంటి అంశాలను జిల్లా యంత్రాంగం ప్రాధాన్యతతో పూర్తి చేసి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ వారి నుంచి నూతన టెర్మినల్ భవన నిర్మాణం కోసం అనుమతులు తీసుకుందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు, కేంద్ర మంత్రుల సహకారం అభినందనీయం అన్నారు. అంతే కాకుండా కడప విమానాశ్రయం నుండి నిరంతరాయ సర్వీసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వయబలిటీ గ్యాప్ ఫండింగ్‌ను కూడా భరించిందని తెలిపారు. ఉడాన్ పథకం ద్వారా నిరంతరాయంగా విమానయాన సర్వీసులను కొనసాగించాలని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులను కోరడం జరిగిందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ అతి పురాతనమైన కడప విమానాశ్రయం ఎప్పటినుండో అభివృద్ధిని ఆకాంక్షిస్తోంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో విమానాల రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయని, ఉడాన్ పథకం ద్వారా అతి తక్కువ ధరలతో విమానయాన సర్వీసు చార్జీలను అమలు చేసి సామాన్యులకు సైతం విమానాలు ఎక్కే అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుతం ఇదే విమానాశ్రయాన్ని మౌలికంగా మరింత విస్తరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోపాటు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్‌లు ఎంతో కృషి చేశారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. అంతకు ముందు లైవ్ ద్వారా దేశ ప్రధాని ప్రసంగిస్తూ.. వేగవంతమైన పౌర విమానయాన సేవలను అందించే క్రమంలో దేశంలోని అన్ని విమానాశ్రయాలను ఆధునీకరణ, పునర్ రూపాంతరం కొరకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ కడప విమానాశ్రయం నుంచి 2022–23 సంవత్సరంలో దాదాపు 70 వేల మంది ప్రయాణికులు విమానయాన సేవలను వినియోగించుకున్నారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన టెర్మినల్ భవనం నిర్మించటానికి భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ చర్యలు చేపట్టిందన్నారు. రూ.266 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన టెర్మినల్ భవన విశిష్టతలు చుస్తే 16,455 చ.మీ. విస్తీర్ణంలో నిర్మించనున్నారు. పీక్ అవర్ సర్వింగ్ కెపాసిటీ 1800 మంది కాగా, ఏడాదికి 25 లక్షల మందిగా నిర్ణయించారు. అందులో 24 చెక్–ఇన్–కౌంటర్లు, 2 కన్వేయర్ బెల్ట్స్, 3 ఎక్స్–బీఐఎస్ యంత్రాలు, 3 ఏరో బ్రిడ్జిలు, 5 స్టార్ గ్రిహ రేటింగ్, 375 కార్ పార్కింగ్ సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని నిర్మించడం జరుగుతోందన్నారు. రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ నాయుడు మాట్లాడుతూ భారత విమానయాన రంగ అభివద్ధి, నిర్వహణ, సేవలను.. ప్రపంచంలోనే అగ్రగామిగా తీసుకురావాలన్న ధ్యేయంతో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యావరణ సాహితమైన అత్యాధునిక స్వదేశీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో మధుసూదన్, రీజనల్ ఎక్సికుటీవ్ డైరెక్టర్ ఎస్.జె. ఫణికర్, కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదార్, ప్రోటోకాల్ ఆఫీసర్ (ఏపీ సీఎం –వివిఐపి) బి.సురేష్ బాబు, టెర్మినల్ మేనేజర్ జోసఫ్, స్థానిక బీజేపీ నాయకులు వంగల శశిభూషణ్‌రెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, జంగటి వెంకట సుబ్బారెడ్డి, అంబిక, పద్మావతిభాయ్, లక్ష్మణరావు, రామకృష్ణారెడ్డితోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి



నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇంతగా విద్యాభివృద్ధికి, విద్యావ్యవస్థ పటిష్టానికి చొరవ చూపలేదు. అదనపు తరగతి గదులను నిర్మించడంతో పాటు సురక్షిత తాగునీరు, తరగతి గదులలో లైటింగ్, ఫ్యాన్‌లు, ప్రహరీలు, బెంచీలు, అధునాతన టాయిలెట్‌లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు ఏర్పాటు చేశారు. క్వాలిటీతో వాల్ పెయింటింగ్ వేయించి అందంగా తయారు చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆసక్తిగా పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు.

– హెచ్.సుబ్బన్న, ఉపాధ్యాయుడు, ఎంపీయూపీ స్కూల్, ప్రకాష్‌నగర్, ప్రొద్దుటూరు

సొంతింటి కల నెరవేరింది



పులివెందుల పట్టణం అంబకపల్లె రోడ్డులో ఉన్న రజక కాలనీలో అద్దె ఇంటిలో నివాసముంటున్నా. నాకు సొంత ఇల్లు లేకపోవడంతో కాంగ్రెస్, టీడీపీ హయాంలో అనేక మార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అయినా సొంతింటి కల నెరవేరలేదు. నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం అర్హులైన పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చే విధంగా జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. ఆ జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరు కావడం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబం అంతా చాకలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ నేపథ్యంలో మాకు ఇల్లు మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరింది. మాకు చాలా ఆనందంగా ఉంది.

– ధనలక్ష్మి,పులివెందుల

సెక్యులర్ అనే పదానికి నిజమైన నిదర్శనం వైఎస్సార్‌సీపీ

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ నబీరసూల్


వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ నబీరసూల్‌కు కండువా కప్పుతున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : సెక్యులర్ అనే పదానికి నిజమైన నిదర్శనం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని కడప నగరపాలక సంస్థ మొట్ట మొదటి డిప్యూటీ మేయర్, నర్సింగ్ విద్యా సంస్థల అధినేత కె.నబీ రసూల్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులందరితో కలిసి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.ఎస్.ఆగా జాన్, ముస్లిం మైనారిటీ నాయకులు కూడా వైఎస్సార్‌సీపీలో స్వచ్ఛందంగా చేరారు. వారికి అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు, వర్గాలకు అతీతంగా జనరంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ఏర్పడే ప్రభుత్వం మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. మతతత్వ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకున్న కారణంగానే ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. 2024లో ఎస్‌బి అంజద్‌బాషాను మంచి మెజార్టీతో గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్ బాషా, ఎన్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్ రెడ్డి, కార్పొరేటర్ అరీఫుల్లా బాషా, షఫీ, స్థానిక నాయకులు అల్లా ప్రకాష్, రఫీ, మూసా తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు పంచాయతీ చాకలవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో కదులుతున్న రైలు కింద పడేందుకు ప్రయత్నించాడు. అయితే రైలు ఢీకొని, రెడ్డెప్ప ట్రాక్ పక్కన పడి తీవ్రంగా గాయపడ్డాడు.

ఉపాధ్యాయుల కృషి వల్లే జగనన్న ప్రభుత్వానికి మంచిపేరు

విద్యా సదస్సులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని ఉపాధ్యాయులు చేసిన కృషి వల్లే జగనన్న ప్రభుత్వానికి దేశ వ్యాప్తంగా మంచిపేరు వచ్చిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మేడా కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ–2020)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నలుమూలల నుంచి 5వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు హాజరయ్యారు. మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ జేఎస్ పరంజ్యోతి ఉపాధ్యాయులు పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఇవన్నీ సమర్థవంతంగా అమలు కావడానికి ప్రధాన కారణం ఉపాధ్యాయులేనని తెలిపారు. డీఎస్సీ–2008లో ఎంపికైన నాలుగు వేల మందికి పోస్టింగ్స్ ఇచ్చామని, ఒకేషనల్, పార్ట్‌టైం వారిని రెగ్యులర్ చేయలేదని తమ దృష్టికి తెచ్చారని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు– డిప్యూటీ సీఎం

జగనన్న ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చడంతోపాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టారన్నారు. పేదపిల్లలకు తాను ఇచ్చే ఆస్తి ఒక్క చదువు మాత్రమేనని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెప్తుంటారన్నారు. దశాబ్దకాలంగా వెనుకబడిన కడపను సుందర నగరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఉపాధ్యాయులంతా తమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై జవాబుదారీగా ఉంటాం: ఎమ్మెల్సీ

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు.

చంద్రబాబు హయాంలో విద్యా విధానం ఎలా ఉంది, ఇప్పుడెలా ఉందని ఉపాధ్యాయులు బేరీజు వేసుకోవాలన్నారు. మహిళా ఉపాధ్యాయులకు 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్ ఎప్పుడైనా వాడుకునేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఏపీ టీచర్స్ జేఏసీ చైర్మన్ ఎం.క్రిష్ణయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ స్టేట్ జనరల్ సెక్రటరీ అశోక్‌రెడ్డి, అపుస్మా వ్యవస్థాపకులు ఎలియాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగయ్య, వివిధ యూనియన్ల నాయకులు నాగేశ్వర్ రెడ్డి, బండి విశ్వనాథ్, క్రుస్మా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వై. రామచంద్రారెడ్డి, ఎస్. రమణారెడ్డి, జేఏసీ కో చైర్మన్ సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


ప్రకాశ్‌నగర్ కాలనీలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

- వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎంపీగా, డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించండి
- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి
- వైఎస్సార్‌సీపీలో భారీ సంఖ్యలో చేరిక

ఎర్రగుంట్ల : రాబోవు ఎన్నికల్లో కడప ఎంపీగా అవినాష్‌రెడ్డిని, జమ్మలమడుగు ఎమ్మెల్యేగా డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ఎంవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో కుర్చకుంటపల్లి, చిర్రాజుపల్లి, సున్నపురాళ్లపల్లి, పెనికలపాడు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన వారిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేర్పించారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతు నిన్నటిదాకా వలంటీర్ వ్యవస్థను పవన్ కల్యాణ్, చంద్రబాబులు విమర్శించి, ఇప్పుడు కొనసాగిస్తామని చెప్పడం వీరి నిలకడలేని మనస్తత్వాన్ని తెలుపుతోందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రహ్మాండమైన పరిపాలన సాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల మన రాష్ట్రంలోనే కాక అన్ని రాష్ట్రాలలో ధరలు పెరిగాయని అయితే దీనిపై చంద్రబాబు, పవన్‌లు ఢిల్లీలో కొట్లాడాల్సింది పోయి గల్లీలోకి వచ్చి జగన్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలందరికి అన్ని పథకాలు అమలు చేస్తునారన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలలో పోటీ చేసే ధైర్యం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు లేదన్నారు. వారికి గెలుస్తామని నమ్మకం కూడా లేదన్నారు. ఎవరు ఏకమైనా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. పవన్ కల్యాణ్‌కు తనపై తనకే క్లారిటీ లేదు.. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. చెప్పిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు సంఘాలకు రుణమాఫీ చేశారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాబోతున్నాడని, ఇది సత్యమని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 70 కుటుంబాలు..

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో 50 కుటుంబాలు, ఇందిరమ్మ కాలనీలో 20 కుటుంబాలు మొత్తం 70 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆదివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 1వ వార్డు ఇన్‌చార్జి ప్రశాంత్ ఆధ్వర్యంలో కంచం బాబు, నాగేంద్రలతో పాటు 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. అలాగే ఇందిరమ్మ కాలనీలో ప్రతాప్‌తో పాటు 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు నియోజకవర్గ పరిశీలకుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి, స్థానిక నాయకులు ప్రశాంత్, డేవిడ్‌లతో పాటు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో వంద కుటుంబాలు..

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌కు చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబావలీ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వీరు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా యువతీ యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అమృతానగర్‌ను ఏర్పాటు చేయగా, తమ పార్టీ అధికారంలోకి వచ్చే వరకు ఇక్కడ అభివృద్ధి జరగలేదన్నారు. ప్రత్యేకించి తాను రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించానని ఎమ్మెల్యే తెలిపారు. పాతికేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అమృతానగర్ అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు లక్ష్మీనారాయణరెడ్డి, తాటి గోపాల్‌యాదవ్, హనుమాన్‌రెడ్డి, చికెన్ బాషా, ఎంపీటీసీ శ్రీనివాసులు, మోషె, పెట్లు సుబ్బయ్య, నూరి, ఎమ్మార్పీఎస్ సుధాకర్, వేంపల్లి సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఎంపీటీసీ బోస్, గాలిపోతుల సుదర్శన్, కమాల్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

కుందూ నదిలో మునిగి అక్కా తమ్ముడు మృతి

రాజుపాళెం : నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందికి షేక్ ఇమాంబీ (27), ఆమె తమ్ముడు పక్కీర మస్తాన్ (26) ప్రమాదవశాత్తు కుందూనదిలో మునిగి ఆదివారం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు షేక్ ఇమాంబీకి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగలేకపోవడంతో పలు ఆలయాలు, దర్గాల వద్ద ప్రార్థనలు చేస్తుండేవారు. అమావాస్య ఆదివారం కావడంతో నంద్యాల జిల్లాలోని సిరివెళ్ల మండలంలో ఓ దర్గా వద్ద ప్రార్థనలు చేసి స్నానమాచరించి ఇంటికి వెళ్లాలని కొందరు సూచించారు. దీంతో ఇమాంబీ, ఆమె భర్త ఖాజా, పక్కీర మస్తాన్ రాజుపాళెం మండలం కూలూరు గ్రామ సమీపంలోని కుందూ నది వద్దకు వెళ్లారు. కుందూ నదిలో మునిగేందుకు ఇమాంబీ, పక్కీర మస్తాన్ నీటిలో దిగగా ఊపిరి ఆడక అక్కడికక్కడే చనిపోయారు. ఇమాంబీ భర్త ఖాజా వారు ఎంత సేపటికి రాకపోవడంతో అక్కడికి వెళ్లి పరిశీలించాడు. అప్పటికే వారిరువురు మృతి చెంది ఉన్నారు. ఈ విషయాన్ని ఖాజా స్నేహితులు, బంధువులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ సిద్ధయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఖాజా, పోలీసు క్రాంతి పరిశీలించారు. ఈ సంఘటనపై షేక్ ఖాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలు ఇమాంబీకి కుమార్తె, కుమారుడు, మృతుడు పక్కీర మస్తాన్‌కు నాలుగు నెలల కుమార్తె ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


మృతి చెందిన అక్క, తమ్ముడు ఇమాంబీ, పక్కీర మస్తాన్

కూలి డబ్బుల కోసం ఘర్షణ

ఐదుగురికి తలకు గాయాలు


గాయపడిన కూలీలు

వేంపల్లె : తాపీ మేస్త్రీ కూలి డబ్బులు ఆలస్యంగా ఇచ్చాడని కూలీల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం స్థానిక రాజీవ్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. శ్రీరామ్ నగర్‌కు చెందిన వల్లపు సురేంద్ర అనే తాపీ మేస్త్రీ రాజీవ్ కాలనీలోని ప్రసాద్‌కు కూలి డబ్బులు రెండు గంటలు ఆలస్యంగా ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ప్రసాద్ మద్యం సేవించి మధ్యాహ్నం రెండు గంటలకు మేస్త్రీకి ఫోన్ చేసి అసభ్య పదజాలంతో మాట్లాడారు. దీంతో మేస్త్రీ సురేంద్ర తనతో పాటు గంగరాజును వెంట తీసుకొని రాజీవ్ కాలనీకి వెళ్లాడు. అక్కడ ప్రసాద్‌తో నీకు కూలీ డబ్బులు ఇచ్చాను కదా తిరిగి ఎందుకు అసభ్యంగా మాట్లాడుతున్నావు అని ప్రశ్నించాడు. దీంతో ప్రసాద్ తన తోటి కూలీలైన యశ్వంత్, వరప్రసాద్ రెడ్డి, గణేష్, విష్ణు, కాటం గంగయ్య., సయ్యద్ సుబహాన్, ఆశీర్వాదంలతో పాటు మహిళలతో కలిసి వారిపై దాడికి దిగారు. తలపై కట్టెలు, రాళ్లతో కొట్టారు. దీంతో మేస్త్రీ సురేంద్ర వారి బంధువులకు ఫోన్ చేయగా వల్లెపు వెంకటసుబ్బయ్య, వల్లెపు రవి, కొమ్మర శేఖర్‌లు అక్కడికి చేరుకున్నారు. వారిపై కూడా కట్టెలతో దాడి చేయడంతో తలకు రక్త గాయాలయ్యాయి. వాగ్వాదం జరిగే సమయంలో ప్రసాద్‌తో పాటు ఆశీర్వాదం, జానయ్య, అనితలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో తలకు గాయాలైన ఐదుగురిని వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ముగ్గురిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.